క్లుప్తంగా

నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలి

భీమడోలు: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా విజయకేతనం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం గారపాటి కనకదుర్గా సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సీ, డీ గ్రేడులను పొందిన వారంతా ఎక్కువ మార్కులు పొందేలా అనుభవజ్ఞులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా విజయకేతనం పుస్తకాలను రూపొందించామన్నారు. జెడ్పీ నుంచి రూ.40 లక్షల నిధులను వెచ్చించామన్నారు. ఈ మెటీరియల్ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు ఉపయుక్తంగా ఉండేలా తయారు చేసినట్టు తెలిపారు. విద్యార్థులంతా పదో తరగతి పరీక్షలకు సంసిద్ధులు కావాలని సూచించారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలోని చిన్నారులు అత్యధిక మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, ఎంఎస్‌సీ చైర్మన్ చింతల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఘంటా ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలి

ఉంగుటూరు: ప్రభుత్వ నుంచి స్థలం పొందిన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలని జాప్యం చేస్తే మార్చి తరువాత పంపిణీ చేసిన పట్టాలు రద్దు చేస్తామని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. ఉంగుటూరు సామాజిక భవనంలో శనివారం లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1,80,000 మంజూరు చేస్తుందని, అదనంగా రూ.35 వేలు డ్వాక్రా రుణం ఇస్తారని తెలిపారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచి బండారు సింధు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, హౌసింగ్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతంపెంచాలి: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఎంపీడీవో రాస్‌మనోజ్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఉంగుటూరు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ఆయన పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

గణపవరం: ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసగౌడ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజయానికి నాంది 'విజయకేతనం'

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా మండలం పరిధిలోని విద్యార్థులు కృషి చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సహకారంతో విద్యార్థులకు విజయకేతన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 31 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 2,080 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు మార్చి 17 నుంచి జరుగుతాయని ఇప్పటికే ప్రభుత్వం టైంటేబుల్ విడుదల చేసిందని తెలిపారు. విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. శనివారం గణపవరం, నిడమర్రు మండలాల పరిధిలోని 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విజయకేతనం పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: పౌష్టికాహారంతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. గుండుగొలనులోని అంగన్‌వాడీకేంద్రం 23 కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో శనివారం పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పౌష్టికాహార స్టాల్‌ను ఆమె పరిశీలించారు. బాల్య దశ నుంచి పిల్లలకు చక్కని పోషక విలువలు గల ఆహారాన్ని తినడం ద్వారా ఆరోగ్యవంతులవుతారని, తద్వారా చదువులోనూ రాణిస్తారని ఎంపీడీవో అన్నారు. గ్రామ కార్యదర్శి ఎం.మురళీ, సూపర్‌వైజర్ కవిత, వీఆర్వో డి.సింహాచలం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ముక్కు మూసుకోవాల్సిందే !


భీమడోలు శ్మశాన వాటికలో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న దృశ్యం


శ్మశాన వాటికలో వదిలి వెళ్లిన కోళ్ల వ్యర్థాల మూటలు


అధ్వానంగా భీమడోలు శ్మశాన వాటిక రోడ్డు

- కోళ్ల వ్యర్థాల మూటల నుంచి దుర్వాసన వ్యాప్తి
- భీమడోలులో అంత్యక్రియల నిర్వహణకూ అవస్థలే
- నీరు, సరైన దారి లేక తీవ్ర ఇబ్బందులు

భీమడోలు: అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికకు వెళ్లేందుకు భీమడోలు ప్రజలు భీతిల్లిపోతున్నారు. శ్మశాన వాటికలో ఇష్టాను సారంగా పారవేసిన కోళ్ల వ్యర్థాల మూటల నుంచి వ్యాపించే దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం ఆ ప్రాంతమంతా వ్యాపిస్తోంది. దీంతో అంతిమ సంస్కారాలకు హాజరైన వారంతా ఇబ్బంది పడుతున్నారు. కొంతకాలంగా పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం రహదారిపై కోళ్ల వ్యర్థాలను పట్టుకుని వాటిని భీమడోలు శ్మశాన వాటికలో పూడ్చుతున్నారు. అయితే వాటిని లోతుగా గొయ్యి తవ్వి పూర్తిస్థాయిలో పూడ్చకుండా వదిలివేయడంతో ఆ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో అంత్యక్రియలకు హాజరైన వారు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనితో భీమడోలు వాసులు శ్మశాన వాటికకు వెళ్లాలంటేనే నరకయాతనను అనుభవిస్తున్నారు. మేజర్ పంచాయతీ భీమడోలులో సుమారు 30వేల మంది జనాభాపైగా నివసిస్తున్నారు. వారికి గ్రామంలోని సర్వే నెం.78లో 16.91 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించారు. ఈ శ్మశాన వాటికను అభివృద్ధి చేయకపోవడంతో అధ్వానంగా మారింది. అంతిమ సంస్కారానికి వెళ్లే బంధువులు, ప్రజలు నడిచేందుకు సైతం సరైన దారి లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అతికష్టంతో అక్కడికి వెళితే కోళ్ల వ్యర్థాల గల మూటలు దర్శనమిస్తున్నాయి. వాటి నుంచి పురుగులు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కుపుటలు అదిరిపోతున్నాయి. అంతిమ సంస్కారాలకు వెళ్లితే ఆనారోగ్యం వెంటబెట్టుకుని రావాల్సిందే అనే పరిస్థితి నెలకొంది. దహన సంస్కారాలు పూర్తయ్యే వరకూ ఆ దుర్గంధాన్ని భరించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

రైతులకు నరకయాతన

శ్మశాన వాటిక పక్కనే వ్యవసాయ క్షేత్రాలుండగా నిత్యం ఇదే దారి నుంచి రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా నిత్యం నరకయాతనను అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో మాంసపు వ్యాపారులు మూగ జీవాలను వధించి వాటి చర్మాలను, వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్తున్నారు.

సమస్యల వలయంతో శ్మశాన వాటిక

భీమడోలు శ్మశాన వాటిక సమస్యల వలయంగా మారింది. అక్కడ నీరు అందుబాటులో లేక అంత్యక్రియల అనంతరం మృతదేహం వెంట వెళ్లే వారు స్నానాలు చేసేందుకు ప్రజలు దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది అక్కడికి ప్రైవేటు మంచినీటి ట్యాంకర్ తెచ్చుకుని స్నానాలంచేరిస్తున్నారు. పూళ్ల, గుండుగొలను తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలను సుందరంగా అభివృద్ధి చేసి అవసరమైన ఏర్పాట్లు చేశారు. భీమడోలు గ్రామ పంచాయతీలో శ్మశాన వాటిక అభివృద్ధిని పట్టించునే నాథుడు కరువయ్యారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. ఇటీవల జనవాణిలో భీమడోలు శ్మశాన వాటిక సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేసారు. దీనిపై ఈవోఆర్డీ ఏ.సుందరిని వివరణ కోరగా భీమడోలు శ్మశాన వాటికలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది కోళ్ల వ్యర్థాలను ఖననం చేస్తున్నారన్నారు. ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న విషయం అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. అక్కడ కోళ్ల వ్యర్థాలను పూడ్చడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను పోలీసులు, రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు, నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం

గణపవరం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహం చేస్తే జీవితాంతం అనారోగ్య సమస్యలు వెంటాడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి అన్నారు. శనివారం గణపవరం మండలం కాశిపాడు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్లకు ఒకసారి వచ్చే గ్రామ దేవతల జాతరను ఫిబ్రవరి 7 నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్వహణ కమిటీ పెద్దలు నిర్ణయించారు. శనివారం భీమడోలులోని గ్రామ దేవతలు గంగానమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు ఆలయ ప్రాంగణం వద్ద అమ్మవార్ల జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు జాతర ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు, నిర్వాహకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ కార్యాలయం

దెందులూరు: శిథిలావస్థలో ఉన్న గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయం ఉద్యోగులను భయపెడుతోంది. ఇరిగేషన్ కార్యాలయం పరిధిలో దెందులూరు, భీమడోలు మండలాలున్నాయి. కార్యాలయంలో ఒక జేఈ, నలుగురు లస్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం గోడల్లో మొక్కలు మొలిచి స్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఐరన్ ఊసలు బయటకు వచ్చాయి. గోడలు బీటలు వారాయి. ఉద్యోగులు ఎవరి మీద పెచ్చులు ఊడి పడతాయోనన్న ఆందోళనతో విధులు నిర్వహిస్తున్నారు. తరచూ రైతులతో అధికారులు సమావేశాలు ఈభవనంలో నిర్వహిస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ కార్యాలయానికి మరమ్మతులు నిర్వహించి పూర్తిస్థాయి భద్రత కల్పించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.


గోడలు బీటలువారిన దృశ్యం



పెచ్చులుడుతున్న కార్యాలయ స్లాబ్

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

భీమడోలు: మంచి ఆలోచనలు, మంచి స్నేహితులు, నిశ్చలమైన మనస్సు విద్యార్థుల విజయానికి సోపానాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్, ఐఏఎస్ కె.శారదదేవి అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కమిషనర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రణాళికాబద్ధంగా చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. తొలుత ఆమె ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెట్‌వెల్ సీఈవో కేవీఎస్ ప్రభాకరరావు, జిల్లా మేనేజర్ పీవీఎన్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కెనడీ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డీఎం బీబీ సింగ్, ఎన్‌సీసీ అధికారి కె.శివశంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.శశికాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.


భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిషనర్ కె.శారదదేవి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

దెందులూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు వాటిని ఉపయోగించుకుని తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యార్థులకు సూచించారు. కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్లో గ్రంథాలయాన్ని ఆమె సందర్శించి పుస్తకాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని ఒక అభిరుచిగా చేసుకోవాలని ఆమె సూచించారు. పాఠశాలలోని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల అభిరుచికి తగిన విధంగా గ్రంథాలను అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయుడు శర్మని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, తహసీల్దార్ బీ. సుమతి, ఎంపీడీఓ కే. శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, సర్పంచ్ ఇంటేటి మధులత, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ గణేష్ కుమార్, ఉపాధ్యాయులు రజాక్ ఉన్నారు.


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్

లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శప్రాయం

భీమడోలు: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బెయిలీ జీవితం ఆదర్శనీయమని భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు అనుసంధానంగా ఉన్న భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బెయిలీ 197వ జయంతిని పురస్కరించుకుని బెయిలీ లిపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూలు అసిస్టెంట్ అక్బరున్నీసా వలి అధ్యక్షత వహించారు. సమగ్ర శిక్షాభియాన్ బెయిలీ లిపిపై విద్యార్థులకు శిక్షణ అందించేందుకు పంపిణీ చేసిన పుస్తకాలను హెచ్‌ఎం భవిత టీచర్ వెంకటదుర్గకు పంపిణీ చేశారు. తొలుత బెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్కూలు అసిస్టెంట్లు ఎండీ అహ్మద్, శ్రీదేవి, భవిత టీచర్లు వెంకటదుర్గ, రత్నకుమారి, కేర్ టేకర్ శిరీషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


భీమడోలులో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, టీచర్లు

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

గణపవరం: అంధుల జీవితల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పరలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి విద్యార్థులకు తినిపించారు. మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, ప్రధానోపాధ్యాయులు జగదీష్, ప్రత్యేక ఉపాధ్యాయులు రాజేంద్ర బాబు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు సైన్స్ ప్రాజెక్టుల ఎంపిక

గణపవరం: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2024–25 సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో జల్లికొమ్మర యూపీ స్కూల్ విద్యార్థి నిమ్మల హనుమ తయారు చేసిన మంకీ గన్ కెమిస్ట్రీ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచినట్లు గణపవరం ఎంఈవో రాజేష్ తెలిపారు. ఈనెల 7,8వ తేదీల్లో విజయవాడ మురళి రిసార్ట్స్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా తరుపున విద్యార్థి నిమ్మల హనుమ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ టీచర్ పి.సౌజన్యను ఎంఈవో గొర్రెల బాలయ్య, ఎంపీపీ దండు రాము, సర్పంచ్ కురెళ్ల త్రిమూర్తులు హెచ్‌ఎం సుందరకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.


మంకీ గన్‌తో విద్యార్థి హనుమ

రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టులు ఎంపిక

భీమడోలు: జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భీమడోలు మండలం నుంచి ప్రదర్శించిన రెండు ప్రాజెక్టులు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. కొవ్వలిలో శనివారం నిర్వహించిన జిల్లా సైన్సు ఫెయిర్‌లో వ్యక్తిగత విభాగాల్లో విద్యార్థి, ఉపాధ్యాయురాలు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పోలసానిపల్లి గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థిని వి.విన్నెల గణితం విభాగంలో త్రికోణమితి పరివర్తనాలు అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని ఎండీ హసేనాబేగం గణితానికి సంబంధించి సమయం, పని సంబంధిత పరిష్కార సమస్యపై ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రథమ స్థానాలను సాధించిన వారిని వి.విన్నెల, హసేనాబేగంను శనివారం కొవ్వలిలో జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అభినందించారు. వారికి మొమెంటోలను అందించారు.


కొవ్వలిలో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయిని హసేనా బేగంకు మొమెంటో అందిస్తున్న డీఈవో

షెడ్యూల్డ్ కులాల జాబితా ప్రదర్శన

దెందులూరు: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో మూడు సచివాలయాలకు సంబంధించి షెడ్యూల్డ్ కులాల జాబితా ప్రచురించామని దెందులూరు గ్రామ కార్యదర్శి అనూష తెలిపారు. శనివారం గ్రామ సచివాలయంలో ఆమె మాట్లాడుతూ జాబితాలను మూడు సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ప్రతి ఒక్కరికీ తెలిసేందుకు టాం టాం ద్వారా ప్రచారం చేయించామన్నారు. ఎస్సీ కులస్తులు జాబితాలను సచివాలయాలకు వెళ్లి ఈనెల 7వ తేదీలోపు చూసుకోవాలని కార్యదర్శి కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు జిల్లాస్థాయి పదవులు


మేకా లక్ష్మణరావు


ఆళ్ల సతీష్ చౌదరి


కత్తుల రవికుమార్


కాటి సుధాకర్


డీబీఆర్‌కే చౌదరి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నేతలను జిల్లా పదవుల్లో నియమిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్‌గా పని చేసిన మేక లక్ష్మణరావుకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన ఆళ్ల సతీష్ చౌదరిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేసిన కత్తుల రవికుమార్‌ను పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన కాటి సుధాకర్‌ను పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. పార్టీ యువ నాయకులు డీబీఆర్‌కే చౌదరిని పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించారు.

తాతా సత్యనారాయణ మృతికి సంతాపం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ తాత సత్యనారాయణ లేని లోటు వ్యక్తిగతంగా పార్టీకి తీర్చలేనిదని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఆయన కోడలు తాతా రమ్యశ్రీ, పెదవేగి ఎంపీపీగా, ఆయన కుమారుడు వైద్యుడిగా ప్రజాసేవలో భాగస్వామ్యమైనందుకు అబ్బయ్యచౌదరి అభినందించారు. తాతా సత్యనారాయణ మరణం బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటున్నామని అబ్బయ్య చౌదరి నివాళులర్పించారు.

దాళ్వా సాగుకు నారుమళ్లు సిద్ధం

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- 4,900 హెక్టార్లతో వరి సాగవుతుందని అంచనా


వరి నాటేందుకు దుక్కి దున్ని తయారు చేసిన పొలం


పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

పెదవేగి : దాళ్వా వరి సాగు చేసే రైతులు నారుమళ్లు పోసే పనుల్లో నిమగ్నమయ్యారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి పరిధిలో 350 హెక్టార్లలో, దెందులూరు మండలంలో 3,400 హెక్టార్లు, పెదపాడు మండలంలో 720 హెక్టార్లు, ఏలూరు రూరల్ 430 హెక్టార్లలో ఈ దాళ్వాలో వరి సాగవుతుందని వ్యవసాయశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నారుమళ్లు పూర్తయ్యాయి. మొత్తం 4,900 హెక్టార్ల పరిధిలో దాళ్వా సాగు అంచనా వేయగా ప్రస్తుతం 3,650 హెక్టార్లలో నారుమడులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణం భూమికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి సిద్ధం చేస్తున్నారు. పెదవేగి మండలంలోని ప్రధాన నీటి చెరువుల్లో కొంత మేర నీరు చేరడంతో రైతులు ఎంతో ఆశతో పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా 1156, 1153, 1121 వరి విత్తనాలను దాళ్వా సాగుకు వినియోగిస్తున్నారు. నారుమళ్ల కోసం పొలాన్ని దున్ని నేలను చదును చేసి, పాయలుగా విడదీసిన అనంతరం విత్తనాలను వెదజల్లుతున్నారు. విత్తనాలను వెదజల్లేందుకు ముందు నారుమడిని రెండు లేక మూడు పర్యాయాలు దమ్ము చేసిన అనంతరం రైతులు చదును చేస్తున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వరి నారుమళ్లు పోసే రైతులు తప్పని సరిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల పంటకు అగ్గితెగులు సోకే అవకాశం ఉండదు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీని లేదా సుడోమోనార్క్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలని పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక తెలిపారు.

విత్తనాలను మెలక కట్టించాలి

వరి విత్తనాలను చల్లే ముందుగా మెలక కట్టి మొలక శాతం పరీక్షించాల్సి ఉంది. లేని పక్షంలో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఎకరానికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల భూమిలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను చల్లుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వరి నారుమడి పోసిన తర్వాత 15 రోజుల్లో జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి. దీనికోసం రెండు శాతం జింక్ సల్ఫేట్, అన్నభేది నిమ్మ ఉప్పును పిచికారీ చేయాలి. నారుమడిలో నీరు పెట్టడానికి తొలగించడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

25 రోజుల తర్వాత నాటాలి

నారుపోసిన 25 రోజుల తర్వాతనే నాట్లు వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు తొలుచు పురుగు నివారణ కోసం నాట్లు వేసేందుకు నారు తీసేందుకు ముందుగా మడిలో ఎకరానికి 1కేజీ కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలి.

– ఎం.ప్రియాంక, వ్యవసాయాధికారిణి, పెదవేగి